# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 02-06-2024** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

**1.** **ఆంధ్రప్రదేశ్‌లో జూన్ 4వ తేదీన జరిగే ఓట్ల లెక్కింపు రోజు హింసాత్మక ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లు, ఎస్పీలను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా ఆదేశించారు.**

**2.** **తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలను ఈ రోజు నిర్వహించేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది.**

**3.** **తెలంగాణలో గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు సంబంధించిన హాల్‌టికెట్లను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ విడుదల చేసింది.**

**4.** **ఈ ఏడాది మే నెలలో ఆంధ్రప్రదేశ్‌లో 3వేల 890 కోట్లు, తెలంగాణలో 4వేల 986 కోట్ల వస్తు సేవల పన్ను వసూలైనట్లు కేంద్ర ఆర్థికశాఖ వెల్లడించింది.**

**5.** **దేశ వ్యాప్తంగా 7వ దశ, తుది విడత లోక్ సభ ఎన్నికల పోలింగ్ నిన్న సాయంత్రం ముగిసింది.**

==========================

ఆంధ్రప్రదేశ్‌లో జూన్ 4వ తేదీన జరిగే ఓట్ల లెక్కింపునకు ముందు హింసాత్మక సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లు, ఎస్పీలను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా ఆదేశించారు. ఈ మేరకు ఆయన నిన్న జిల్లా కలెక్టర్లు, ఎస్పీలకి లేఖ రాశారు. మే 13న అత్యంత ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడం ద్వారా అత్యధిక శాతం పోలింగ్ నమోదు చేయడంలో ఎన్నికల యంత్రాంగం కృషి అమూల్యమైనదని పేర్కొన్నారు. అదేవిధంగా కీలకమైన కౌంటింగ్ ప్రక్రియను కూడా ప్రశాంత వాతావరణంలో పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కౌంటింగ్ హాళ్ల వద్ద ఎటువంటి ఇబ్బందులు సృష్టించకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, గొడవలు జరిగే ప్రాంతాలు, గొడవలు సృష్టించడానికి అవకాశం ఉన్న వ్యక్తులను గుర్తించి నిరంతర నిఘాతో పర్య వేక్షించాలని తెలిపారు. వదంతులు వ్యాప్తి చేయకుండా తక్షణం వేగంగా స్పందించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.

--------------------------

బీజేపీ సీనియర్ నాయకులు, ప్రధానమంత్రి నరేంద్రమోదీ 45 గంటల ధ్యానాన్ని నిన్న ముగించారు. తమిళనాడు కన్యాకుమారిలోని వివేకా రాక్ మెమోరియల్‌లో ప్రధానమంత్రి ధ్యానం ముగిసిన అనంతరం

తమిళకవి తిరువళ్లువర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. భారత ఆధ్యాత్మిక గురువు స్వామి వివేకానందా భారత మాతా విశిష్టతను తెలియజేసిన ప్రాంతంలోనే ప్రధానమంత్రి 45 గంటల పాటు ధ్యానం చేశారు.

---------------------------

తెలంగాణ ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్ర పునర్నిర్మాణానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి తెలిపారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణలో ప్రజా పాలనను అందిస్తామన్నారు. అన్ని రంగాల్లోనూ తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి సాధించేలా భవిష్యత్తు ప్రణాళికలు, సరికొత్త విధానాలను రూపొందిస్తున్నామని తెలిపారు. విభజన చట్టం ప్రకారం ఇంతకాలం ఉమ్మడి రాజధానిగా ఉన్న హైదరాబాద్ ఇకపై తెలంగాణకు మాత్రమే రాజధానిగా ఉంటుందన్నారు.

---------------------------

తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించి పది సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా రాష్ట్ర ప్రజలకు తెలంగాణ గవర్నర్ రాధా కృష్ణన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలంగాణ పౌరుల హృదయాలను అపారమైన ఆనందం, గర్వంతో నింపుతుందని శుభాకాంక్షల సందేశంలో పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో అమరులైన వారి అచంచలమైన అంకితభావానికి సవినయంగా నివాళులర్పిస్తున్నానని తెలిపారు.

కాగా తెలంగాణ అవతరణ దినోత్సవం సందర్భంగా ఆ రాష్ట్ర ప్రజలకు ఆంధ్రప్రదేశ్ గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆయన సందేశం ఇచ్చారు. ప్రత్యేక సంస్కృతి, కళల సమ్మేళనమే తెలంగాణ అని పేర్కొన్నారు. అక్కడి మహిళలు నిర్వహించే పూల పండగ అయిన బతుకమ్మ.. తెలంగాణ సంస్కృతిని, గుర్తింపును చాటుతోందని ఆయన పేర్కొన్నారు.

---------------------------

తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలను నిర్వహించేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను ఈరోజు సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహిస్తారు. ఈరోజు ఉదయం పరేడ్ మైదానంలో జాతీయ జెండా ఆవిష్కరణ అనంతరం రాష్ట్ర గీతాన్ని ఆవిష్కస్తారు. పోలీసు సిబ్బందికి, ఉత్తమ శకటాలకు అవార్డులను ప్రదానం చేస్తారు. సాయంత్రం ట్యాంక్‌బండ్‌పై ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్ పరిసరాలను సుందరంగా తీర్చిదిద్దారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన కళాబృందాలతో ప్రత్యేక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు.రాష్ట్ర అవతరణ వేడుకల్లో భాగంగా హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. చార్మినార్, సచివాలయం, అమరజ్యోతి స్తూపం, అంబేద్కర్ విగ్రహం, గోల్కొండ వంటి ప్రముఖ పర్యాటక ప్రదేశాల్లో విద్యుత్ దీపాల కాంతులను ఏర్పాటుచేశారు.

---------------------------

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ట్యాంక్‌బండ్, సికింద్రాబాద్ పరేడ్ మైదానం ప్రాంతాల్లో కార్యక్రమాలు ఏర్పాటు చేసిన నేపథ్యంలో గత అర్ధరాత్రి నుంచి ఈ రోజు అర్ధరాత్రి వరకు ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉంటాయని పోలీసు అధికారులు తెలిపారు. వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయాణించాలని పోలీసులు సూచించారు.

ఈ రోజు  ఉదయం ఆరు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ పరేడ్ గ్రౌండ్ పరిసర ప్రాంతాల్లో వాహనాలకు అనుమతి లేదని తెలిపారు.

---------------------------

తెలంగాణలో గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్షకు సంబంధించిన హాల్‌టికెట్లను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ – టీజీపీఎస్సీ నిన్న  విడుదల చేసింది.  పరీక్ష రాసే అభ్యర్థులు కమిషన్ వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని టీజీపీఎస్సీ తెలిపింది.  జూన్ 9వ తేదీన ఉదయం 10 గంటల 30 నిమిషాల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్ష జరగనుందని అధికారులు తెలిపారు. పరీక్ష రోజు ఉదయం 9గంటల నుంచే పరీక్ష కేంద్రాల్లోకి అభ్యర్థుల్ని అనుమతిస్తామని,. పది  తర్వాత ఎవరినీ లోపలికి అనుమతించేది లేదని అధికారులు స్పష్టంచేశారు. కాగా  రాష్ట్రంలో 563 గ్రూప్–1 పోస్టుల భర్తీ కోసం ఫిబ్రవరి 23 నుంచి మార్చి 16వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించగా.. తెలంగాణ వ్యాప్తంగా 4.03 లక్షల మందికి పైగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు.

---------------------------

ఈ ఏడాది మే నెలలో ఆంధ్రప్రదేశ్‌లో  3వేల 890 కోట్లు, తెలంగాణలో 4వేల 986 కోట్ల వస్తు సేవల పన్ను – జీఎస్టీ వసూలయినట్లు కేంద్ర ఆర్థికశాఖ వెల్లడించింది. గత ఏడాది మేతో పోలిస్తే ఈ మే నెలలో ఆంధ్రప్రదేశ్‌లో 15 శాతం, తెలంగాణలో 11 శాతం, వృద్ధిరేటు నమోదైనట్లు తెలిపింది. దేశంలోని వివిధ రాష్ట్రాలు మే నెలలో సగటున 15శాతం వృద్ధి సాధించాయని పేర్కొంది.

---------------------------

దేశ వ్యాప్తంగా 7వ దశ, తుది విడత లోక్ సభ ఎన్నికల పోలింగ్ నిన్న సాయంత్రం ముగిసింది. 7 రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతం పరిధిలోని 57 స్థానాల్లో పోలింగ్ జరిగింది. నిన్న 7 గంటలకు  ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 6 గంటల వరకు కొనసాగింది. గత రాత్రి 8 గంటల సమయానికి సగటున 59 శాతం పోలింగ్ నమోదైయియిందని కేంద్రఎన్నికల సంఘం తెలిపింది. ఈ విడత ఎన్నికల్లో మొత్తం 904 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. జూన్ 4వ తేదీన ఎన్నికల ఫలితాలు ప్రకటిస్తారు.

---------------------------

తెలంగాణలో  ఓట్ల లెక్కింపు ప్రక్రియలో  10వేల మంది సిబ్బంది  పాల్గొంటారని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్ తెలిపారు. హైదరాబాద్‌లో నిన్న  నిర్వహించిన పాత్రికేయుల  సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కౌంటింగ్ కేంద్రాల వద్ద నాలుగు అంచెల భద్రత ఏర్పాటు చేశామన్నారు.  కౌంటింగ్ కేంద్రంలో ఏజెంట్లు, సిబ్బంది సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు వినియోగించేందుకు అనుమతిలేదని స్పష్టం చేశారు. పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు కోసం 276 బల్లలు  ప్రత్యేకంగా ఉంటాయని జూన్ 4న ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్లు, 8 గంటల 30 నిమిషాలకు ఈవీఎంలలో ఓట్ల లెక్కింపు ప్రారంభం అవుతుందని తెలిపారు. మూడు శాసనసభ నియోజకవర్గాలలో  అత్యధికంగా 24 రౌండ్లలో, అత్యల్పంగా 13 రౌండ్లలో లెక్కింపు ఉంటుందన్నారు. కౌంటింగ్ కేంద్రాల్లో 2 వేల 400 మందికి పైగా సూక్ష్మ పరిశీలకులు ఉంటారని వికాస్‌రాజ్ తెలిపారు.

---------------------------

తెలుగు రాష్ట్రాలకు రుతుపవనాల విస్తరిస్తున్నాయని భారత వాతావరణ శాఖ తెలిపింది. ఆంధ్రప్రదేశ్,

తెలంగాణాలో జూన్ మొదటి వారంలో ప్రవేశిస్తాయని తెలిపింది. ఆంధ్రప్రదేశ్‌లో మొదట రాయలసీమలో రుతుపవనాల ప్రభావం కనిపిస్తుందని, ఆ తర్వాత రాష్ట్రమంతా విస్తరిస్తాయని తెలిపింది. ఈరోజు నుండి ఆంధ్రప్రదేశ్‌లో వర్షాలు కురిసే అవకాశం ఉందని, అప్పటిదాకా వాతావరణం పొడిగా ఉంటుందని తెలిపింది. దక్షిణ కోస్తాలో వడగాలులు కొనసాగుతాయని, అక్కడక్కడా ఓ మోస్తరు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. తెలంగాణలో ఈరోజు నుంచి రాగల 5 రోజుల పాటు రాష్ట్రంలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. రేపు నల్గొండ, సూర్యాపేట, హన్మకొండ, మహబూబ్‌నగర్, నారాయణపేట, గద్వాల్ జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశముందని, ఆ జిల్లాలకు పసుపురంగు హెచ్చరికలు జారీ చేసింది.

---------------------------

తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహిస్తున్న శ్రీ వేంకటేశ్వర సాంప్రదాయ ఆలయ శిల్ప కళాశాలలో 2024-25 విద్యాసంవత్సరానికి గాను సాంప్రదాయ కళంకారి కళలో డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు గడువును జూలై 6వ తేదీ వరకు పొడగించినట్లు టీటీడీ ఒక ప్రకటనలో తెలిపింది. తిరుపతి కళాశాలలో జూలై 6వ తేదీ వరకు దరఖాస్తులు పొందవచ్చని పేర్కొంది.

========================